# పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలి

- పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో చేపడుతున్న ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు అజయ్ వి.నాయక్ ఆరా
- ఎన్నికల బందోబస్తు సందర్భంగా పోలీసుల అత్యుత్సాహం వద్దు.. అలాగని ఉపేక్షించవద్దు
- ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించరాదు
- ఎన్నికల బరిలో 24 మంది అభ్యర్థులు.. మొదటి ర్యాండమైజేషన్ పూర్తి
- ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్ ఏర్పాట్లపై అధికారులతో పరిశీలకుల సమీక్ష



రాష్ట్రఎన్నికల పరిశీలకుడు అజయ్ వి.నాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ రోహిణిప్రియదర్శిని

మెదక్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో చేపడుతున్న ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు అజయ్ వి.నాయక్ ఆరా తీశారు. శుక్రవారం జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లపై రాష్ట్ర జనరల్ అబ్జర్వర్ అజయ్ వి.నాయక్, రాష్ట్ర పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రా వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా వారికి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ రోహిణిప్రియదర్శిని, జిల్లా సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్ బీపీ, పోలీసు పరిశీలకుడు సంతోశ్‌కుమార్‌లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్ల గురించి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా రాష్ట్ర పరిశీలకులకు పవర్ పాయింట్ ద్వారా వివరించారు. జిల్లాలోని రెండు నియోజకవర్గంలో 24 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని, మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల గురించి జిల్లాకు కేటాయించబడిన సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్‌ను ఆరా తీయగా, ఇప్పటి వరకు రెండు నియోజకవర్గాల పరిధిలోనూ పరిస్థితులన్నీ సజావుగానే ఉన్నాయని వివరించారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘాను ఏర్పాటు చేయాలని స్టేట్ అబ్జర్వర్లు పోలీస్ కమిషనర్‌కు సూచించారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎలక్షన్ కమిషన్ పాసులు ఉన్న వారిని మినహాయించి, ఇతరులు ఎవరినీ లోనికి అనుమతించకూడదని, ఈ విషయమై క్షేత్ర స్థాయిలో బందోబస్తు విధులు నిర్వర్తించే సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించరాదని, పోలింగ్ స్టేషన్ల సమీపంలో ఓటర్లను అభ్యర్థులు, వారి ఏజెంట్లు కలిసి వారికే ఓటు వేసేలా ఒత్తిడి చేయకుండా కట్టుదిట్టమైన నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల బందోబస్తు సందర్భంగా అత్యుత్సాహం ప్రదర్శించకూడదని, అలాగని నిబంధనల ఉల్లంఘనకు పాల్పడే వారిని ఏమాత్రం ఉపేక్షించకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటింగ్ సందర్భంగా ఏవైనా పోలింగ్ కేంద్రాల వద్ద అనుకోని రీతిలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే సమాచారం అందిన వెంటనే హుటాహుటిన అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించాలని తెలిపారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు, మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు అంబదాస్ రాజేశ్వర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



చిలిపిచెడ్: జగ్గంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ సర్పంచ్

## బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

చిలిపిచెడ్, నవంబర్ 17: చిలిపిచెడ్ మండలంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతున్నది. బీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఇంటింటికీ తిరుగుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని జగ్గంపేట మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు పోచయ్య అధ్యర్యంలో కోరుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని జగ్గంపేటలో నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలుపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న విద్యార్థులు

## ఓటుతో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

చిన్నశంకరంపేట, నవంబర్17: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు పుష్పవేణి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని మిర్జాపల్లి జడ్పీ పాఠశాలలో విద్యార్థులు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్య దేశాల్లో ఓటు ఓ వజ్రాయుధంలాంటిదని అన్నారు. విద్యార్థులంతా తమ తల్లిదండ్రులు ఓటు హక్కును ప్రాముఖ్యతను వివరించాలని హెచ్ఎం పుష్పవేణి సూచించారు.

## పండ్ల తోటల పెంపకానికి ముందుకు రావాలి

చిన్నశంకరంపేట, నవంబర్17: పండ్ల తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలని జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి రమాకాంత్ సూచించారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయన పండ్ల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రమాకాంత్ మాట్లాడుతూ.. నాటిన మొక్కలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో వెంకటసాయి, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్‌లు ఉన్నారు.

## బీఆర్ఎస్ కళాబృందం ప్రచారం



చిలిపిచెడ్: బండపోతుగల్‌లో నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డికి మద్దతుగా కళాజాత నిర్వహిస్తున్న కళాబృందం సభ్యులు

చిలిపిచెడ్, నవంబర్ 17: చిలిపిచెడ్ మండలంలోని పలు గ్రామాల్లో నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి మద్దతుగా 'కళాకారులు కళాజాత' నిర్వహించి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలపై పాటలతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం మండలంలోని బండపోతుగల్, అజ్జమర్రి, ఫైజాబాద్, గూజిరి తండా, శీలాంపల్లి, గౌతాపూర్ గ్రామాల్లో శ్రీశైలంగౌడ్ కళాబృందం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డిని కారు గుర్తు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలకు, రైతులకు పాటల రూపంలో ప్రచారం చేస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు ప్రవీణ్, లక్ష్మి, భవానీ, వాణి, జ్యోతి, సుమలత, హరిత, కృష్ణ తదితరలు పాల్గొన్నారు.



సూర్యానాయక్‌కు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు

## బీజేపీ మాజీ ఎంపీటీసీ బీఆర్ఎస్‌లో చేరిక

చిన్నశంకరంపేట, నవంబర్17: చిన్నశంకరంపేట మండలం జంగరాయి మాజీ ఎంపీటీసీ రేణుక సూర్యనాయక్ బీజేపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం రేణుక సూర్యనాయక్‌తో పాటు కొర్విపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులకు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలో సరైన గుర్తింపు లేకనే ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరానని సూర్యనాయక్ తెలిపారు. మెదక్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి విజయం కోసం కృషి చేస్తానని అన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

మెదక్ రూరల్, నవంబర్ 17: గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందిన ఘటన మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ అమర్ కథనం ప్రకారం.. శుక్రవారం రాత్రి మెదక్ మండలంలోని మాచవరం-పేరురూ గ్రామాల మధ్య ఉన్న శ్రీ బాలాజీ పైపుల గోదాం దగ్గర గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అతడి వయస్సు సుమారు 50 ఏండ్లు, ఎరుపురంగు షర్టు , నలుపురంగు ప్యాంటుతో ఉన్నాడు. అతడి వివరాలు తెలియలేదు. మెదక్ ప్రభుత్వ ఏరియా దవాఖానలో మార్చురీ మృతదేహంను ఉంచినట్లు తెలిపారు. ఆ వ్యక్తి వివరాలు తెలిసినవారు మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ 8712657916, 871265917 నంబర్లలో సంప్రదించాలని ఎస్ఐ వెల్లడించారు.

## బుల్లెట్లు దొరికిన వ్యక్తి అరెస్ట్

నర్సాపూర్, నవంబర్ 17: మెదక్ జిల్లా నర్సాపూర్‌లో గురువారం జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో బుల్లెట్లు దొరికిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు నర్సాపూర్ ఎస్సై శివకుమార్ వెల్లడించారు. ఎస్సై శివకుమార్ వివరాల ప్రకారం.. ఈనెల 16న నర్సాపూర్‌లో జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభా ప్రాంగణంలో అనుమానస్పదంగా తిరుగుతూ ఉండగా సీఐ షేక్‌లాల్ మధార్, ఎస్సై శివకుమార్, సిబ్బంది అస్లామ్ అనే వ్యక్తిని పట్టుకున్నారు. అస్లామ్‌ను తనిఖీ చేయగా, అతని పర్సు నందు రెండు తుపాకీ రౌండ్లు 7.65 ఎమ్ఎమ్(బుల్లెట్స్) దొరికాయి. అనంతరం అతడిని పోలీస్‌స్టేషన్ తీసుకువచ్చి విచారించారు. అస్లామ్ 2016లో జోగిపేటలో డిగ్రీ చదువుతున్న సమయంలో ఎన్‌సీసీ విభాగంలో ఖాసీపూర్ నందు శిక్షణ పొందాడు. అప్పుడు అక్కడ గదిలో రెండు తుపాకీ రౌండ్లు(బుల్లెట్స్) దొరికాయి. వాటిని ఎవరికి చెప్పకుండా తనవెంట తెచ్చుకున్నాడు. అస్లామ్‌పై కేసు నమోదు చేసి, రెండు తుపాకీ రౌండ్లను స్వాధీనం చేసుకొని జైలుకు తరలించారు. అస్లామ్ స్వగ్రామం సంగారెడ్డి జిల్లా రాయికోడ్. ప్రస్తుతం మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని చండూర్ గ్రామంలో బంధువుల వద్ద ఉంటూ చికెన్ షాప్‌లో పనిచేస్తున్నాడు.

## డిసెంబర్ 7న శ్రీగురుపీఠం శిలాన్యాసం

శివ్వంపేట, నవంబర్ 17: శివ్వంపేట మండలం గూడూరులో శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పెద్దగొని శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించే శ్రీగురుపీఠం దేవాలయ శిలాన్యాసం డిసెంబర్ 7వ తేదీన నిర్వహించనున్నారు. శిలాన్యాసం కార్యక్రమం విశ్వంజి విశ్వయోగి దత్తగిరి మహరాజ్ స్వామిజీ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈమేరకు శుక్రవారం బర్దీపూర్ దత్తగిరి మహరాజ్‌కు మొదటి ఆహ్వాన పత్రికను శ్రీగురుపీఠం ఎండీ శాస్త్రుల వెంకటేశ్వరశర్మతో కలిసి శివకుమార్‌గౌడ్ అందజేశారు.

## బాధిత కుటుంబానికి ఇఫ్కో డైరెక్టర్ పరామర్శ

చిన్నశంకరంపేట, నవంబర్ 17: చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్ మాజీ సర్పంచ్ ప్రియానాయక్ భర్త బాలకృష్ణ గుండెపోటుతో మృతి చెందండంతో బాధిత కుటుంబాన్ని శుక్రవారం ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి పరామర్శించారు. మృతదేహానికి పుష్పగుచ్ఛంతో నివాళులర్పించారు.ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు, ఎంపీటీసీ యాదగిరి సర్పంచులు నాగలక్ష్మి, దయానంద్‌యాదవ్, గోపాల్‌నాయక్, మాజీ సర్పంచ్ కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, నరేశ్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.